

- ఆరోగ్య శాఖ భవనాల్లో ప్రభుత్వాఫీసులు
- వ్యవసాయ శాఖ చేతిలో క్లినిక్ భవనం గదులు
- అర్బన్ హెల్త్ సెంటర్‌ను కోల్పోయిన పెద చెరువు వాసులు
- ఇరుకు గదుల్లో డైస్ సెంటర్ నిర్వహణ
- స్థలం కేటాయింపులో జాప్యం కొనసాగితే సీసీబీ కోల్పోయే ప్రమాదం



ఆరు బయట విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సాగర్ ప్రాజెక్టు కమిటీకి.. కూటమి అభ్యర్థుల ఖరారు

- చైర్మన్‌గా పులుకూరి.. వైస్ చైర్మన్‌గా చక్రపాణి
- పీసీ పదవి రెండు.. మూడేళ్లుగా పంపిణీ
- రెండేళ్లు పులుకూరి.. మూడేళ్లు గోగినేని
- డెల్టాలోనూ.. చెరి సగం..!
- తొలి రెండేళ్లు మురళీధరరావు
- తదుపరి మూడేళ్లు సునీల్ చౌదరి



పులుకూరి కాంతారావు | ఉప్పలపాటి చక్రపాణి | గోగినేని కోటేశ్వరరావు

(నరసరావుపేట, బాపట్ల ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ కూటమి అభ్యర్థులను తెలుగుదేశం అధిష్ఠానం ఖరారు చేసింది. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో నేడు జరగనున్న ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరగనున్నాయి. పీసీ పదవికి టీడీపీ నేతల మధ్య పోటీ ఏర్పడటంతో అధిష్ఠానం దృష్టి సారించింది. పదవులు ఆశిస్తున్న వారితో చర్చలు జరిపింది. ఎమ్మెల్యేల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకొని శుక్రవారం పీసీ అభ్యర్థులను ఖరారు చేశారు. పోటీ ఉండటంతో ఐదేళ్ల పీసీ పదవిని రెండేళ్లు.. మూడేళ్లుగా పంపిణీ చేసింది. తొలుత రెండేళ్లు గురజాల నియోజకవర్గానికి చెందిన కారంపూడి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు పులుకూరి కాంతారావు పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. తదుపరి మూడేళ్లు సత్తెనపల్లి నియోజకవర్గంలోని ముపాళ్ల డీసీ అధ్యక్షుడు గోగినేని కోటేశ్వరరావును ఖరారు చేశారు. ఈ మేరకు ఇద్దరి మధ్య అధిష్ఠానం సయోధ్య చేసింది. తొలుత తమ నియోజకవర్గానికే పీసీ పదవి కావాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కన్నా లక్ష్మీనారాయణ పట్టు పట్టారు. ఇరువురి మధ్య పార్టీ అధిష్ఠానం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. కాగా పల్నాడు జిల్లాకు చైర్మన్ పదవి కేటాయించగా, బాపట్ల జిల్లాకు వైస్ చైర్మన్ పదవిని అధిష్ఠానం కేటాయించింది. పర్చూరు నియోజవర్గానికి చెందిన కొనంకి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు ఉప్పలపాటి చక్రపాణి పేరును ఖరారు చేశారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో పీసీ ఎన్నికల కోసం జలవనరుల శాఖ ఏర్పాట్లు చేసింది. పీసీ పరిధిలో మొత్తం 48 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. వీరు పీసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. అధిష్ఠానం పేర్లు ఖరారు చేయడంతో పీసీ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక లాంచనమే. పల్నాడు జిల్లాలో 25, గుంటూరు జిల్లాలో 5, బాపట్ల జిల్లాలో 8, ప్రకాశం జిల్లా పరిధిలో 10 డీసీలు ఉన్నాయి.

డెల్టాలోనూ.. ఇద్దరికి

కృష్ణా వెస్ట్రన్ డెల్టా(కేడబ్ల్యూడీ) పరిధిలోని ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నిక శనివారం జరగనుంది. ఈ పదవి విషయంలో అధిష్ఠానం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చి పేర్లు ఖరారు చేసినట్లు సమాచారం. తొలి రేండేళ్లు రేపల్లె నియోజకవర్గానికి చెందిన పంతాని మురళీధరరావు ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా వ్యవహరించనుండగా, తదుపరి మూడేళ్లు కాకుమాను మండలానికి చెందిన సునీల్ చౌదరి వ్యవహరించనున్నారు. ఇప్పటికే వీరి నియామకానికి సంబంధించి శుక్రవారం రాత్రికే జిల్లాకు చెందిన నేతలు ఏకాభిప్రాయానికి రాగా, శనివారం ఉదయం జరిగే ఎన్నిక ఏకగ్రీవం కానుందని సమాచారం. అమర్తలూరు మండల పరిధిలోని కూచిపూడి లాకుల వద్ద ఉన్న ఇరిగేషన్ శాఖ భవనం వేదిక కానుంది. ఇప్పటికే జిల్లా పరిధిలో ఉన్న 22 డీసీల పదవుల్లో కొలువుదీరిన వారికి శనివారం ఉదయం 7 గంటలకల్లా కూచినపూడి లాకుల వద్దకు చేరుకోవాలని ఇరిగేషన్ శాఖ సమాచారం ఇచ్చింది.

మరో ఆరు నెలలు.. అధికారుల పాలనే

- సహకార ఎన్నికలు లేవు
- ఉత్తర్వులు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సహకార సంఘాలకు గతంలో నియమించిన పర్సన్ ఇన్‌చార్జ్‌ల కాల పరిమితిని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 21 నుంచి పర్సన్ ఇన్‌చార్జ్‌ల కాల పరిమితి ముగియనుండడంతో సొసైటీలకు ఎన్నికలు జరుగుతాయని ప్రచారం జరిగింది. ఒక వేళ ఎన్నికలు నిర్వహించకపోతే త్రిసభ్య కమిటీలను నామినేట్ చేస్తారని కూడా ప్రచారం చేశారు. వీటన్నిటికి ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెడుతూ పర్సన్ ఇన్‌చార్జ్ పాలనను కొనసాగిస్తూ ఆయా జిల్లాల సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్‌లు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 168 సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 12,31,363 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. 2018 నుంచి ఎన్నికలు నిర్వహించలేదు. అప్పట్లో సొసైటీల అధ్యక్షుల పదవీ కాలం 2019 వరకు పొడిగించారు. రైతుల భాగస్వామ్యంతో సహకార సంఘాలు పనిచేయాలి. రైతులు ఓటు ద్వారా వారికి నచ్చిన రైతులను సంఘాలకు ఎన్నుకోవాలి. రైతుల ప్రయోజనాలే పరమావధిగా సొసైటీలు పనిచేయాలి. వీటన్నింటికి గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చింది. రైతులకు సొసైటీలకు మధ్య దూరం పెంచింది. ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన కమిటీలను ప్రభుత్వమే నియమించింది. పార్టీ వ్యక్తులను నామినేషన్ పద్ధతిలో సొసైటీలకు ఎంపిక చేసింది. దీంతో సొసైటీలు పూర్తి రాజకీయ కేంద్రాలుగా మారిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారులకే సొసైటీల పాలనను అప్పగించింది. దీనివలన కొంత రాజకీయ జోక్యం తగ్గే అవకాశం ఉందంటున్నారు. ఎన్నికలు నిర్వహించేందుకు పాలకులు సాహసం చేయకపోవడానికి సొసైటీల ఓటర్ల జాబితాల్లో అవకతవకలు ఉండటమేనన్న వాదన వినిపిస్తోంది. వైసీపీ హయాంలో ఏకపక్షంగా సభ్యుల పేర్లు నమోదు చేశారన్న విమర్శలున్నాయి. వీటన్నింటిని సరిదిద్దిన తరువాత ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

పేదల ఆరోగ్యం.. కావాలి ప్రాధాన్యం



ఆస్పత్రి భవనంలో వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రజల ప్రధాన అవసరాలలో ఆరోగ్యం ప్రధానమైంది. దీనికి ప్రభుత్వాలు కూడా అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు మంజూరు చేస్తున్నాయి. అలాంటిది పల్నాడు జిల్లాలో మాత్రం అధికారులు ఆరోగ్యశాఖ మీద చిన్నచూపు చూస్తున్నారు. ప్రజలకు ఆరోగ్యపరంగా విస్తృత సేవలు అందించాల్సింది పోయి, ఆరోగ్య శాఖ భవనాలు ఆక్రమించడంపై స్థానికంగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు కూడా ప్రభుత్వాల ప్రాధాన్యతను గుర్తించడంలేదు. కొత్త జిల్లా ఏర్పాటుతో వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన భవనాలను స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో వైద్య శాఖాధికారులు అడ్డు చెప్పినా వారిని లక్ష్య పెట్టలేదు. ఫలితంగా కొన్ని వైద్య సేవలు జిల్లా వాసులకు దూరమయ్యాయి.

విలేజ్ క్లినిక్ భవనంలో వ్యవసాయ శాఖ కార్యాలయం

లింగంగుంట్లలో విలేజ్‌క్లినిక్ భవనాన్ని వ్యవసాయశాఖ బలవంతంగా తీసుకుంది. క్లినిక్ నిర్వహణకు ఇబ్బంది అని చెప్పినా లక్ష్య పెట్టలేదు. ఈ క్లినిక్‌లో రోజు వారి ఓపీ వైద్య సేవలు అందిస్తారు. చిన్నారులకు వ్యాక్సిన్‌లు కూడా వేస్తారు. 104 వైద్య సేవలను ఈ క్లినిక్‌లోనే నిర్వహించాల్సి ఉంది. ఈ భవనంలోని రెండు గదుల్లో వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. క్లినిక్ నిర్వహణకు ఉన్న భవనం సరిపోవడంలేదని అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా వారు పట్టించుకోవడంలేదు. జేడీ కార్యాలయాన్ని ఎక్కడైనా నిర్వహించుకునే అవకాశం ఉంది. చాలీచాలని భవనంలో రోగులకు వైద్యసేవలు అందించేందుకు ఆరోగ్యసిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వారి విధులను ఆరుబయట నిర్వహించాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌కు స్థలం ఎప్పుడిస్తారు..?

కేంద్ర ప్రభుత్వం నరసరావుపేట పట్టణానికి రెండు అర్బన్ హెల్త్ సెంటర్‌లను మంజూరు చేసింది. ఒక సెంటర్ పెద్ద చెరువులో.. మరో సెంటర్ వెంకట రెడ్డి నగర్‌లో భవనాల నిర్మాణాన్ని మునిసిపాలిటీ చేపట్టింది. వెంకటరెడ్డి నగర్‌లో సెంటర్ వినియోగంలోకి వచ్చింది. పెదచెరువులో నిర్మాణంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను అప్పటి కలెక్టర్ క్యాంప్ కార్యాలయం కోసం తీసుకున్నారు. ఈ సందర్భంగా అర్బన్ హెల్త్ సెంటర్‌ను అదే ప్రాంతంలో మరోచోట నిర్మించేందుకు సరిపడా స్థలం కేటాయిస్తామని, భవన నిర్మాణానికి వెచ్చించిన నిధులు చెల్లించేలా ఒప్పందం కుదిరిందని మునిసిపల్ అధికారులు అప్పట్లో ప్రకటించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయ నిర్మాణం పూర్తిచేసి వినియోగిస్తున్నారు. నేటి వరకు అప్పటి ఒప్పందం ప్రకారం స్థలం కేటాయించలేదని, నిధులు తిరిగివ్వలేదని మునిసిపల్ అధికారులు తెలిపారు.

ఇరుకు గదుల్లోనే డైస్ సెంటర్

లింగంగుంట్లలో ప్రస్తుతం ఎస్పీ కార్యాలయం నిర్వహిస్తున్న భవనం నేషనల్ హెల్త్‌మిషన్ కింద రూ.83లక్షలతో నిర్మించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చింది. రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం కోసం భవనాన్ని నిర్మించారు. చిన్నారుల్లో శారీరక, మానసిక ఎదుగుదలకు సంబంధించిన లోపాలు గుర్తించి వారికి చికిత్సలు అందించేందుకు డైస్ కేంద్రాన్ని నిర్మించారు. ఎస్పీ కార్యాలయానికి ఈ భవనం కేటాయించిన సందర్భంలో రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ కోఆర్డినేటర్ అడ్డుకున్నా ప్రయోజనం లేకపోయింది. మానసిక ఇబ్బందులు ఎదుర్కొనే చిన్నారులకు వైద్యసేవలు అందించేందుకు అన్ని వసతులతో భవనాన్ని నిర్మించారు. దీనిలో ఎస్పీ కార్యాలయం ఏర్పాటుతో పాత ఆస్పత్రి భవనంలోని ఇరుకు గదుల్లో డైస్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. వసతులు లేక వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన భవనం నిర్మాణానికి నేటి వరకు స్థలం కేటాయించలేదు.

క్రిటికల్ కేర్ బ్లాక్ భవనం స్థలం పరిస్థితీ అంతే..

ప్రస్తుతం నిర్వహిస్తున్న ఏరియా వైద్య శాలకు క్రిటికల్ కేర్ బ్లాక్(సీసీబీ) భవనం మంజూరైంది. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రా మిషన్ కింద సీసీబీని మంజూరు చేశారు. ప్రస్తుతం 200 పడకల వైద్య శాలను 300 పడకల ఆస్పత్రిగా మార్పు చేశారు. మరో వంద పడకల కోసం.. 75 పడకల సీసీబీ కోసం రెండు భవనాలను నిర్మించాల్సి ఉంది. వీటికి స్థలం కొరత వెంటాడుతోంది. ఆస్పత్రికి 2016లో ప్రభుత్వం 4.20 ఎకరాల స్థలం కేటాయిస్తు జీవో విడుదల చేసింది. ఈ జీవో నేటి వరకు రద్దు కాలేదు. సదరు స్థలం వైద్య శాఖ కిందే ఉంది. ఈ స్థలంలో సీసీబీని వైద్య శాఖ ప్రతిపాదించింది. ఎస్పీ కార్యాలయానికి తాత్కాలిక పద్ధతిలో కొంత స్థలాన్ని కేటాయించారు. దీంతో సీసీబీ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం పోలీసు శాఖ చేతిలో ఉందని చెబుతున్నారు. వైద్యశాఖ ప్రతిపాదించిన సదరు స్థలంలో సీసీబీ నిర్మించే విషయంలో పోలీసు శాఖ అడ్డుకుంటున్నదన్న వాదనను వైద్యశాఖ వర్గాలు వినిపిస్తున్నాయి. అయితే ఎస్పీ కార్యాలయ నిర్వహణకే ప్రభుత్వం స్థలం కేటాయించిందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఇరు శాఖల మధ్య స్థలం పంచాయితీ నడుస్తుండగా ప్రత్యామ్నాయ స్థలం కోసం రెవెన్యూ శాఖ పరిశీలిస్తోంది. అత్యంత కీలక సీసీబీ విషయంలో పోలీసు శాఖ రోగుల ప్రాణాల విషయంలో మానవతా దృక్పథంతో ఆలోచించాలన్న వాదన వినిపిస్తోంది.

విజయ్ డిజిటల్‌ను ప్రారంభించిన మంత్రి లోకేశ్



విజయ్ డిజిటల్ షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి లోకేశ్

మంగళగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పాతబస్టాండు సెంటరులో విజయ్ డిజిటల్ షోరూం నిర్వాహకులు నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్స్ సూపర్ స్టోర్‌ను ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ప్రారంభించారు. తొలుత షోరూం నిర్వాహకులు, కూటమి నేతలు, కార్యకర్తలు మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి లోకేశ్ షోరూంను ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేశారు. షోరూంలో ఎలక్ట్రానిక్ వస్తువులను పరిశీలించారు. షోరూం సిబ్బంది, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ఫొటోలు దిగారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రజల నుంచి మంత్రి లోకేశ్ అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో విజయ్ డిజిటల్ షోరూం అధినేతలు జవ్వాది గంగాధరరావు, ఉషాకిరణ్, జవ్వాది రాహుల్, జయశ్రీ, జవ్వాది లోహిత, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, నేతలు జవ్వాది కిరణ్‌చంద్, సంకా బాలాజీగుప్తా, గోవాడ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు అల్ ఇండియా ఓపెన్ చెస్ టోర్నమెంట్

తాడికొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో ఈ నెల 22న ఆల్ ఇండియా ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు పేర్కొన్నారు. ఆనంద్ చెస్ వింగ్స్, చలపతి ఫార్మసీ కళాశాల సంయుక్తంగా చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నమెంట్లో గెలుపొందిన విజేతలకు రూ. 1,55,000 నగదు బహుమతి అందిస్తున్నట్లు తెలిపారు. చెస్ పోటీల్లో పాల్గొనే వారు 21వ తేదీలోపు పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ సీఎం. గోపీనాథ్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఈపీఎఫ్ పెన్షన్‌దారులు బ్యాంకు ఖాతాలు మార్చుకోవాలి

గుంటూరు(విద్య), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల పరిధిలోని ఈపీఎఫ్ చందాదారులు తమ బ్యాంకు ఖాతాలను జాతీయ బ్యాంకులకు మార్చుకోవాలని ప్రాంతీయ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతాదారులు ఎస్‌బీఐ, యూబీఐలోకి మార్చుకోవాలని, కొన్నిచోట్ల యాక్సిస్ బ్యాంకు ఖాతాలు సరిగా పని చేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. సమస్యలు ఉంటే 0863-2344106, 2232921, లేదా ro.guntur@epfindian.gov.in అనే మెయిల్‌లో సంప్రదించాలని సూచించారు.

అంకితభావంతో పనిచేసి పార్టీ రుణం తీర్చుకుంటా

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

నరసరావుటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయుడు చీఫ్‌విప్‌గా అవకాశం ఇవ్వడంతో బాధ్యత మరింత పెరిగిందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పార్టీకి మరింత అంకితభావంతో పనిచేసి పార్టీ రుణం తీర్చుకుంటా అన్నారు. చీఫ్‌విప్‌గా అసెంబ్లీ సక్రమంగా జరగటానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడడం బాధాకరం అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని తప్పులు చేస్తే 11 సీట్లుకు పరిమితం అయ్యారో ఒకసారి ఆలోచించుకోవాలని అన్నారు. రాష్ట్రాన్ని లూటీ చేయడం, రూ. 10 లక్షల కోట్లు అప్పులు చేయడం తప్ప జగన్‌మోహన్‌రెడ్డి చేసింది ఏమీ లేదన్నారు. గోదావరి, పెన్నా నదులు అనుసంధానం చంద్రబాబు నాయుడు మొదలు పెడితే జగన్‌మోహన్‌రెడ్డి పనులు ఆపివేసి, నిధులు పక్కదారి పట్టించి గాలికి వదిలేశారన్నారు. వరికపుడిశల ప్రాజెక్టుకు హామీ ఇచ్చి పల్నాడు ప్రజలను జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేశాడన్నారు. రాజధాని నిర్మాణం గాలికి వదిలేశారని, పోలవరం చంద్రబాబు నాయుడు 72 శాతం పూర్తి చేస్తే మిగిలింది జగన్ ఎందుకు చేయలేక పోయారో చెప్పాలన్నారు. రాజధాని నిర్మాణం కోసం రూ.33,138 కోట్లు కూటమి ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇంటర్ విద్యార్థులకు చంద్రబాబు నాయుడు పెట్టిన మధ్యాహ్న భోజనం వైసీపీ ప్రభుత్వం ఎందుకు ఆపేసిందో చెప్పాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మళ్లీ మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసిన చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. రానున్న రెండేళ్లలో గోదావరి, పెన్నా అనుసంధానానికి బాటలు వేస్తామన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. సమావేశంలో టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాల పాటి శ్రీధర్, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, భాష్యం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సాగు చేసే ప్రతిరైతుకు బీమా వర్తింప చేయాలి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ జె.వెంకటమురళి



జిల్లా స్థాయి కమిటీతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేస్తున్న ప్రతిరైతుకు లబ్ధి చేకూరేలా బీమా పథకాన్ని వర్తింప చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద రైతులను లబ్ధిదారులుగా చేర్చే విషయమై శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంక్‌ల ద్వారా పంట రుణాలు పొందిన రైతులు బాపట్ల జిల్లాలో 1.40 లక్షల మంది ఉన్నారన్నారు. సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలు రైతులు 23 వేల మంది ఉన్నారన్నారు. రైతులే ప్రీమియం చెల్లించేలా చైతన్య పర్చాలన్నారు. తద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. రైతుల కోసం గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బీమా పథకాల నమోదు కోసం జిల్లాలో 247 కామన్ సర్వీస్ సెంటర్‌లు పనిచేస్తున్నాయన్నారు. ప్రస్తుతం 412 హెక్టార్లకు 414 మంది రైతులు మాత్రమే బీమా పథకం ప్రీమియం చెల్లించారన్నారు. రైతులంతా ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా వ్యవసాయశాఖాధికారులు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 7 పంటలకు బీమా అమలౌతుందన్నారు.సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ, ఉద్యానవనశాఖాధికారి జెన్నెమ్మ, జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటరత్నం, సీపీవో శ్రీనివాస్, ఎల్‌డీఎం శివకృష్ణ, టాటాఏఐజీ ఏజెన్సీ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌వోబీలు జిల్లా బ్రాండ్‌ను ప్రతిబింబించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి
● డిజైన్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ వీక్షణ



శంకర్‌విలాస్ ఆర్‌వోబీ డిజైన్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ ఆర్‌వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి)పై కన్సల్టెంట్ రూపొందించిన డిజైన్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు. కన్సల్టెంట్ మొత్తం రెండు డిజైన్లను రూపొందించి రోడ్లు, భవనాల శాఖకు అందజేయగా ఆ శాఖ అధికారులు వాటిని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్‌కు నివేదించారు. ఒక డిజైన్ హిందూ కళాశాల సర్కిల్ నుంచి అరండల్‌పేట 10వ లైను వరకు, మరో డిజైన్ సర్కిల్ నుంచి 100 మీటర్ల నుంచి ప్రారంభమయ్యేలా రూపొందించారు. దాదాపు కిలోమీటర్ పొడవునా బ్రిడ్జి ఉండేలా డిజైన్‌లు తయారు చేశారు. వాటిని శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ నాగలక్ష్మి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేస్తూ నూతనంగా నిర్మించనున్న బ్రిడ్జి ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలన్నారు. అలానే ఐకానిక్ ఆర్కిటెక్చర్‌ని ప్రతిబింబించేలా ఉండాలని స్పష్టం చేశారు.

ట్రాఫిక్ సజావుగా వెళ్లేలా..

ఆర్‌వోబీ డిజైన్, పిల్లర్ల నిర్మాణం, సర్వీసు రోడ్లు, అండర్ పాస్‌లు, బ్రిడ్జిపై డిజైన్లు నూతనంగా ఉండాలన్నారు. ఐకానిక్ డిజైన్‌తోపాటు పిల్లర్లపై జిల్లా బ్రాండ్ ప్రతిబింబించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి ఎమర్జన్సీ విభాగం వద్ద అంబులెన్స్‌లకు ఇబ్బంది లేకుండా డిజైన్ రూపొందించాలన్నారు. ట్రాఫిక్ సజావుగా వెళ్లేలా అండర్‌పాస్‌లు ఉండాలన్నారు. మహిళా కళాశాల రోడ్డు నుంచి బ్రిడ్జి అండర్‌పాస్ వైపునకు వచ్చే ట్రాఫిక్‌కు అనుగుణంగా కొన్ని మార్పులు చేయాలని సూచించారు. దీనికోసం మహిళా కళాశాల రహదారిపై ప్రయాణించే వాహనాల ట్రాఫిక్‌పై 24 గంటలు సర్వే చేసి డిసెంబరు 24వ తేదీ నాటికి నివేదిక అందించాలన్నారు. ట్రాఫిక్ సర్వే నివేదిక ఆధారంగా డిజైన్లపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, ట్రాఫిక్ డీఎస్పీ ఎం రమేష్, ఈఈలు విశ్వనాథరెడ్డి, చిన్నయ్య, నగరపాలకసంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రెహమాన్, రైల్వే డీఈఎన్ భరత్‌కుమార్, కన్సల్టెన్సీ ప్రతినిధులు నరేంద్ర, ప్రణీత్, సిటిజన్స్ ప్రతినిధి కుటుంబరావు పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్ డెడ్ లైన్లు ఇలా...

- డిసెంబరు 31 నాటికి భవనాల విలువ లెక్కించడాన్ని మున్సిపల్ కార్పొరేషన్ పూర్తి చేయాలి. రోడ్లు, భవనాల శాఖ టెక్నికల్ శాంక్షన్ ఇవ్వాలి.
- జనవరి 31 నాటికి విద్యుత్ స్తంభాలు, తీగెలు, వాటర్ పైపులైన్లు వంటివి షిఫ్టింగ్ చేయాలి.
- ఫిబ్రవరి 28 నాటికి 120 అడుగుల రోడ్డుని జీఎంసీ రోడ్లు భవనాల శాఖకు స్వాధీనం చేయాలి.
- ఫిబ్రవరి 28న టెండర్ల ప్రాసెసింగ్ చేపట్టి కాంట్రాక్టర్ ఎంపిక జరగాలి.

స్పష్టమైన ఆర్థిక నివేదికలతోనే సంస్థల అభివృద్ధి



ప్రసంగిస్తున్న వర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధర్‌రావు

పెదకాకాని, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్పష్టమైన ఆర్థిక నివేదికలతోనే సంస్థల అభివృద్ధి చెందుతాయని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధర్‌రావు శుక్రవారం పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలోని కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, అసోసియేషన్ ఆఫ్ సర్టిఫైడ్ చార్టెడ్ అకౌంటెన్సీ (ఏసీసీఏ) ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ స్టాండర్డ్స్ (ఐఎఫ్‌ఆర్‌సీ) అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గంగాధర్ రావు మాట్లాడుతూ ఆర్థిక నివేదికలు, ఆదాయ వ్యయాలను అంచనా వేసుకొని మార్కెట్‌కు అనుగుణంగా మార్పులు చేర్పులు, అంచనాలు వేసినప్పుడే ఆయా సంస్థల మనుగడ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇటువంటి అంశాలపై కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు లోతైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. నిపుణులు అందించే వివరాలను అందిపుచ్చుకొని జ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ మాట్లాడుతూ అధ్యాపకుల జ్ఞానాభివృద్ధి కార్యక్రమాలు ఎప్పటికప్పుడు తాజా సమాచారంతో ఉండటం గొప్ప విషయం అన్నారు. ముంబాయికి చెందిన ఏసీసీఏ ప్రతినిధి జహీర్ సయ్యద్ మాట్లాడుతూ వ్యాపార సంస్థలు ఆర్థిక నివేదికల సమర్పణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధివిధానాలను వివరించారు. 100 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలు తప్పనిసరిగా ఐఎఫ్‌ఆర్ ఎస్ మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. చెన్నైకు చెందిన అసోసియేషన్ ఆఫ్ సర్టిఫైడ్ చార్టెడ్ అకౌంటెన్సీ ప్రతినిధి రాయిన్సన్ ఎబినేజర్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే మార్కెట్ అంచనాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కామర్స్ విభాగాధిపతి ఆచార్య రామినేని శివరాం ప్రసాద్ మాట్లాడుతూ కామర్స్ బిజినెస్ మేనేజ్మెంట్ విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విభాగం అధ్యాపకులు డాక్టర్ ఏ. కనకదుర్గ, డాక్టర్ రత్న కిషోర్, డాక్టర్ జి.నాగరాజు, డాక్టర్ వి.విష్ణు, డాక్టర్ కె.సుధీర్ కుమార్, చంద్రబాను రెడ్డి, డాక్టర్ కృష్ణకుమారి, అనుబంధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రైస్తవ మిషనరీ స్థలం కబ్జాకు యత్నం

● అడ్డుకునేందుకు యత్నించిన వారికి బెదిరింపులు
● పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇన్నర్‌రింగ్ రోడ్డుకు చేరువలో ఉన్న సుమారు నాలుగు ఎకరాల్లోని ఈ సంస్థ స్థలం విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రూ.50 కోట్ల వరకు ఉంది. గత మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 46వ డివిజన్ నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ఆరికట్ల శ్రీనివాసరెడ్డి ఈ స్థలంపై కన్నేశారు. అయితే డెహ్రాడూన్‌లో ఉన్న న్యూ లైఫ్ సంస్థ ఛైర్మన్ హెలీనాను సంప్రదించి ఈ స్థలాన్ని కారు చౌకగా కొనేందుకు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. వాస్తవానికి ఆ సంస్థ బై లా ప్రకారం ఈ స్థలాన్ని ఎవరికీ అమ్మడం గానీ, కొనుగోలు చేయడం గానీ చెల్లదని, అనాథ శరణాలయం, హాస్టల్, స్కూలు, చర్చి వంటి వాటిని సంస్థ నిర్వహించలేని పక్షంలో మరో సంస్థకు అప్పజెప్పే విధంగా బైలాలో ఉన్నట్లు పూర్వ విద్యార్థులు అంటున్నారు. అంతేగాక శ్రీనివాస్ రెడ్డి వద్ద ఎటువంటి ఒప్పందం ఉందో కూడా తమకు తెలియదనీ, ఎవరికి చూపలేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని విద్యార్థులు అంటున్నారు. సంఘటనపై పూర్వ విద్యార్థి యాజలి సుధీర్ నల్లపాడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటాం

న్యూ లైఫ్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న చర్చిని కూల్చి వేయడం విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు శుక్రవారం రాత్రి ఘటనా స్థలాన్ని సందర్శించి కూల్చిన చర్చిని పరిశీలించారు. సంస్థ స్థలాన్ని, అందులోని చర్చిని కొనసాగించే విధంగా ప్రభుత్వ పరంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

తక్షణమే అరెస్టు చేయాలి

చర్చిని కూల్చి వేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని క్రిస్టియన్ మైనార్టీ సెల్ మాజీ ఛైర్మన్ మద్దిరాల ఇమ్మానియేల్ అన్నారు. సంస్థ నిర్వాహకులకు కూడా దానిని విక్రయించే అధికారం లేదనీ, విక్రయించినా అది చెల్లదని ఆయన స్పష్టం చేశారు. అర్ధరాత్రి చర్చిని కూల్చివేయడం దారుణం అన్నారు. ఈ ఘటనపై పూర్వ విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తక్షణం నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరూ ప్రేమ, కరుణ కలిగి ఉండాలి

● మంత్రి నారా లోకేశ్



సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలను అనుసరించి ప్రతి ఒక్కరూ ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. మంగళగిరి మండలం ఆత్మకూరు నిర్మలా ఫార్మసీ కళాశాలలో శుక్రవారం జరిగిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం మంత్రి లోకేశ్ క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. 2019 నుంచి మంగళగిరిలో తన ప్రయాణాన్ని ప్రారంభించానని, అప్పటి ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ మనోధైర్యాన్ని కోల్పోకుండా ఎన్నో పాఠాలు నేర్చుకున్నానని చెప్పారు. వైఫల్యమే విజయానికి సోపానంగా నిలుస్తుందని, అందుకు తానే ఉదాహరణ అని పేర్కొన్నారు. వందేళ్ల స్వతంత్ర భారత్ దిశగా పయనిస్తున్న తరుణంలో 2047 నాటికి ఏపీని అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అందుకు యువత తమ వంతు బాధ్యత పోషించాలన్నారు. తొలుత కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, అధ్యాపకులు మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం పలికారు. విద్యార్థుల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఫాదర్ బాల బొల్లినేని, కళాశాల డైరెక్టర్ యూ.శౌరీలు, కరస్పాండెంట్ జి.నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాములరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దశావతార వెంకన్నను దర్శించుకున్న అశోక గజపతిరాజు



ఆలయ సందర్శనలో కేంద్ర మాజీ మంత్రి అశోక గజపతిరాజు

పెదకాకాని, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురు గల దశావతార వేంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రాన్ని కేంద్ర మాజీ మంత్రి అశోక గజపతి రాజు శుక్రవారం దర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రదక్షిణ నిర్వహించిన అనంతరం దశావతార వేంకటేశ్వర స్వామికి, మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆయన్ను శేషవస్త్రాలతో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనడంలేదని ఆత్మహత్యాయత్నం

చుండూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తన ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయడం లేదంటూ కౌలురైతు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన చుండూరులో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌలు రైతు వెనిగళ్ల సాయి దేవదాయ శాఖకు చెందిన ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. తేమశాతం ఎక్కువగా ఉండటతో గత కొద్ది రోజులుగా కూలీల చేత ఆరబెట్టి లాటు కట్టాడు. శాంపిల్స్ తీసి అధికారుల వద్దకు తీసుకు వెళ్లగా కొనుగోలు చేస్తామని చెప్పి, తిరిగి మిల్లర్లు కొనుగోలు చేయడం లేదని కొనుగోలు నిలిపి వేశారు. దీంతో తీవ్రంగా నష్టపోతానన్న బాధతో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా చుట్టుపక్కల వారు అడ్డుకున్నారు. తిరిగి కొంత సమయానికి దగ్గరలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి వైర్లు తాకడానికి ప్రయత్నించడంతో స్థానికులు కర్రలతో నెట్టి వేయడంతో కింది పడి గాయాల పాలయ్యాడు. ఇరుగుపొరుగు వారు అతనిని ఆటో ఎక్కించి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మెటల్ లారీలకు రూ.36 వేలు జరిమానా

యడ్లపాడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ అనుమతులు లేకుండా మెటల్, గ్రానైట్ తరలిస్తున్న వాహనాలను మైనింగ్‌శాఖ అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని బోయపాలెం పరిధిలో గురువారం రాత్రి మైనింగ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో మైనింగ్ అనుమతులు లేకుండా స్టోన్ క్రషర్‌ల నుంచి మెటల్ రవాణా చేస్తున్న 6 లారీలను అధికారులు పట్టుకున్నారు. లారీ డ్రైవర్లు ఏఎంఆర్ సంస్థ జారీ చేసిన రవాణా బిల్లులు ఉన్నాయనీ, తమ లారీలను ఎందుకు అడ్డుకున్నారంటూ మైనింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. క్వారీల నుంచి క్రషర్‌లకు రవాణా చేసే ముడి మెటల్‌కు మాత్రమే ఏఎంఆర్ సంస్థ నుంచి బిల్లులు తీసుకుని తోలుకోవాలని, క్రషర్ నుంచి మెటల్‌ను రవాణా చేసేందుకు మైనింగ్‌శాఖ నుంచి ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందాలన్నారు.

ఆర్నెల్ల కిందటే చెప్పాం...

ఈ విషయాన్ని ఆర్నెల్ల కిందటే క్రషర్ యజమానులకు తెలియజేశామనీ, అయినా వారు ఆన్‌లైన్ బిల్లులు తీసుకోవడం లేదన్నారు. ఆన్‌లైన్ బిల్లులు చూపితేనే వదులుతామనీ, లేకుంటే అపరాధ రుసుం చెల్లించి లారీలను తీసుకెళ్లాలని అధికారులు తేల్చి చెప్పారు. లారీ యజమానులకు, మైనింగ్ అధికారులకు మధ్య వాదన జరుగుతుందన్న సమాచారంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. క్రషర్ యజమానులను రప్పించి లారీల్లోని మెటల్ పరిమాణం ఆధారంగా అపరాధ రుసుం విధించారు. ఒక్కొక్క లారీకి రూ.6వేల చొప్పున రూ.36 వేలు జరిమానా చెల్లించి లారీలను తీసుకెళ్లారు. కాగా సరైన అనుమతి పత్రాలు లేకుండా ఫిరంగిపురం నుంచి గ్రానైట్ లోడుతో వెళ్తున్న ట్రాలీ లారీని సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీలలో మైనింగ్ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ కల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 577.80 అడుగులు ఉంది. ఇది 276.66 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7086 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8280 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 18,900 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 36,966 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 36,966 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101.109.120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

53,675 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 46,813 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 53,675 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 44,415 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	13800	334	8000	13500
నెంబరు. 5	8500	12000	నెంబరు.5	8500	14000
273	9000	11500	273	10000	11000
341	8000	15000	341	8000	13300
4884	11000	13500	4884	8000	15000
సూపర్ 10	--	--	సూపర్ 10	11000	14000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16500	తేజ	8000	16500
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	7500	13000
దేవనూరు డీలక్స్	8000	14500	దేవనూరు డీలక్స్	10000	10300
తెల్లకాయలు	4000	11000	తెల్లకాయలు	4000	9500

నెహ్రూనగర్ తండాలో వైద్య శిబిరం

దుర్గి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నెహ్రూనగర్ తండాలో గురువారం రాత్రి రోటరీ క్లబ్ మాచర్ల మాచర్ల, రంగమ్మ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యాన వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 500 మందికి వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యుడు, రోటరీ క్లబ్ జిల్లా 3150 డిప్యూటీ గవర్నర్ కొండవీటి రామకోటయ్య, వైద్యులు మూఢావత్ సౌమ్య బాయి, దశరథ్‌చౌహాన్, రోటరీక్లబ్ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి, నిమ్మగడ్డ సురేఖ, అన్నపురెడ్డి లక్ష్మి, తుమ్మల రాధా, డాక్టర్ వంశీ, డాక్టర్ లలితకిరణ్ పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

రెంటచింతల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రెంటచింతల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.సరోజనిదేవి చెప్పారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జడ్పీటీసీ, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

విద్యతోనే అభివృద్ధి : తాళ్లూరి

దుర్గి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని కార్డ్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్నాథ్ అన్నారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం నిర్వహించిన బాలబాట డెవలప్‌మెంట్ ఆర్గనైజర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం బాలబాట డీవోలు 25 మందికి నూతన వస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో బాలబాట ఏసీవో కుక్కమూడి ప్రమీల, కలివెల సైమన్, కుక్కమూడి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరి పంట కోత ప్రయోగం

మాచవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మాచవరంలో శుక్రవారం వరి పంట కోత ప్రయోగం నిర్వహించారు. గ్రామానికి చెందిన గొడవర్తి కృష్ణ వరి పంటలో 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రధానమంత్రి పసల బీమా యోజన పథకంలో భాగంగా వరి పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ ప్రయోగంలో 15.250 కిలో గ్రాములు దిగుబడి రావటం జరిగిందని, దీనిని బట్టి ఎకరానికి 30 నుంచి 32 బస్తాలు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇన్సూరెన్స్ అధికారి సురేష్, ఉద్యాన సహాయకులు కరుణకుమారి, వ్యవసాయ సహాయకులు ఎం.నరసయ్య, రైతులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలి : ఏవో

మాచవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వరి పండించిన రైతులు మీ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి రామమ్మ సూచించారు. మండలంలోని వేమవరం తదితర గ్రామాల్లో మార్కెటింగ్ శాఖ, నడికూడి మిల్లర్లు శుక్రవారం వరి ధాన్యాన్ని పరిశీలించారు. తేమ శాతం 18 కంటే తక్కువ ఉన్న వరి ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోలు చేయటం జరుగుతుందన్నారు. సాధారణ రకం రూ.1725, ఏ గ్రేడు రకం రూ.1740, 75 కేజీల చొప్పున కొనుగోలు చేయటం జరుగుతుందన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

● జిల్లా కలెక్టర్ పీ అరుణ్ బాబు



బ్రుగుబండలో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ పీ.అరుణ్ బాబు

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భూ సంబంధ, ఇతర సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని కలెక్టర్ పీ.అరుణ్ బాబు అన్నారు. మండలంలోని బృగుబండ గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సమస్య ఎటువంటిదైనా రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవచ్చని, ఆ సమస్యను ఆ సంబంధిత శాఖకు పంపించటం జరుగుతుందన్నారు. ఎలాంటి భూ సమస్యనైనా పరిశీలించి నిర్దీత సమయంలో పరిష్కరించటం జరుగుతుందన్నారు. ముందుగా పలువురి రైతుల అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎన్ని అర్జీలు వచ్చాయి?, ఎలాంటి అర్జీలు వచ్చాయని తహసీల్దార్ చక్రవర్తిని అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలి

విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఆదేశించారు. గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌ను ఆయన సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారంటూ విద్యార్థులను ప్రశ్నించారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజన నాణ్యత విషయంలో ఎలాంటి రాజీపడవద్దని కలెక్టర్ తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో మాట్లాడారు. మెను ప్రకారం చిన్నారులకు భోజనం అందించాలని అంగన్ వాడీ కార్యకర్తను ఆదేశించారు. గ్రామంలోని సీసీ రోడ్లు, సీసీ కల్వర్టులను ఆయన పరిశీలించారు. గోకులం షెడ్డును పరిశీలించి దాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఈ.మురళి, ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, డ్వామా పీడీ సిద్దలింగ మూర్తి, ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్‌డీ ఏ.శ్రీనివాసరెడ్డి, వీఆర్‌వో నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● క్రోసూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం క్రోసూరులో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామస్థుల నుంచి సమస్యలతో కూడిన వినతి పత్రాలు వెల్లువలా అందాయి. వివిధ వర్గాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాస యాదవ్‌కు అందజేశారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాండ్రు కాశయ్య ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు క్రోసూరులో చెరువు సర్వే నెంబరులో నమోదై ఉన్న ఇంటి స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించి సుమారు రెండు వేల మందికి ఊరట కల్పించాలని వినతి పత్రంలో కోరారు. క్రోసూరులో ఆర్టీసీ బస్సులు ఆగే చోట బహిరంగ మరుగుదొడ్లు నిర్మించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని పలువురు స్థానికులు కోరారు. రెవెన్యూ అధికారులు ఒకే సర్వే నెంబరులో ఉన్న భూములన్నింటినీ ఆన్‌లైన్ చేయకుండా ఒకటో, రెండో పట్టాలు నమోదు చేసి మిగతా భూమిని మిగులు భూమిగా చూపించి చేతులు దులుపుకుంటున్నారని సీపీఎం నాయకులు వినతి పత్రం సమర్పించారు. నెల రోజుల్లో చాలా వరకు సమస్యలు పరిష్కరిస్తామని, కొన్నింటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

● పెదకూరపాడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : క్షేత్ర స్థాయిలో వివిధ రకాల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు వేదిక అని తహసీల్దార్ మీసాల డానియేలు అన్నారు. మండలంలోని కాశిపాడు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన భూ సంబంధిత, ఇతర సమస్యలకు సంబందించి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ పున్నం రాజు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలను కూడా పరిశీలించారు.

అధికారుల గైర్హాజరుపై మండి పడ్డ ప్రజా ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంగళరావు

మాచవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరుకాకపోతే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి?, ఎలా పరిష్కారమవుతాయి?, అధికారులు రాని సర్వసభ్య సమావేశాలు ఎందుకంటూ ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. మాచవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ దారం అంబులమ్మ అధ్యక్షతన జరిగింది. ఎంపీడీవో వెంగళరావు వివిధ శాఖల అధికారుల ద్వారా వారి శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సభలో సభ్యులకు వివరించారు. మరికొన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరుకాకపోవటంతో జడ్పీటీసీ శివ యాదవ్, ఎంపీటీసీలు మండిపడ్డారు. అధికారులే కాకుండా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కూడా హాజరు కావటం లేదంటూ మాచవరం ఎంపీటీసీ చిట్టిప్రోలు గురవయ్య సభలో మాట్లాడారు. తహసీల్దార్ క్షమారాణి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పారుట్ల శివారులో భూ సర్వే శనివారం నుంచి ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఏవో రామమ్మ మాట్లాడుతూ రైతులు పత్తి, ధాన్యం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అమ్ముకోవాలన్నారు. ఈ సమావేశంలో యడ్లపల్లి రామారావు, పుసులూరి రామయ్య, మాలపాటి మల్లయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలి

పిడుగురాళ్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను అర్హులైన వారు ఉపయోగించుకోవాలని ఎంపీడీవో సీహెచ్ రామచంద్రరావు తెలిపారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ అనసూర్య అధ్యక్షతన జరిగింది. పలుశాఖల అధికారులు హాజరై ఆయా శాఖల ప్రగతిని గురించి వివరించారు. ప్రస్తుత వాతావరణం పరిస్థితులకు తగ్గట్టుగా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ఈ సమావేశంలో డీఎల్‌డీవో గబ్రూనాయక్, ఉప ఎంపీపీ సాతులూరి బాబు, ఈవోపీఆర్డీ దయాకర్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నాగరాజును సన్మానించిన యాగంటి

మాచర్ల టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దుర్గి మండలం ఆత్మకూరు చెరువుకు నీటి సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన బూసాని నాగరాజును టీడీపీ సీనియర్ నేత, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు సన్మానించారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం నాగరాజును దుశ్శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా యాగంటి మాట్లాడుతూ ఆత్మకూరు చెరువు పరిధిలో గ్రామాలకు తాగు, సాగునీరు సక్రమంగా అందించాలని నాగరాజుకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలేపల్లి మాజీ సర్పంచ్ బూసాని మల్లయ్య, వెంకటరెడ్డి, అనంత రామయ్య, తిక్కా కొండలు, బొట్టు కోటేశ్వరరావు, దుర్భకుల ప్రసాదరావు పాల్గొన్నారు.

విద్యార్థి కోటేశ్వరరావు మృతదేహం రిజర్వాయర్‌లో లభ్యం



టి.కోటేశ్వరరావు

రెంటచింతల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మాచర్ల సమీపంలోని బొంబాయి కంపెనీ వద్ద కాలువలో ఈతకు దిగి గల్లంతైన విద్యార్థి మృతదేహం శుక్రవారం ఉదయం మంచికల్లు రిజర్వాయర్‌లో లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జెట్టిపాలెం గ్రామానికి చెందిన తాటిమళ్ల కోటేశ్వరరావు (15) ఈ నెల 18న మాచర్ల సమీపంలోని లింగాపురంలోని అమ్మమ్మ ఇంటికెళ్లాడు. మధ్యాహ్నం సమీపంలోని కాలువలోకి ఈతకు దిగి నీట మునిగిపోయాడు. లభ్యమైన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యార్థి మృతికి టీచర్ల సంతాపం

స్థానిక బాల వికాస్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 8వ తరగతి చదివే తాటిమళ్ల కోటేశ్వరరావు ఆకస్మిక మరణానికి కరస్పాండెంట్ అల్లం ఇన్నారెడ్డి, టీచర్లు సంతాపం వెలిబుచ్చారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విద్యార్థి మృతి చెందడంతో పాఠశాలకు శుక్రవారం సెలవు ప్రకటించారు.

కుమార్తె అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

రెంటచింతల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కుమార్తె అదృశ్యంపై తల్లి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని దామరచర్ల మండలం వాడపల్లికి చెందిన పిల్లి సునీతను మంచికల్లు గ్రామానికి చెందిన ఆరే పిచ్చయ్యకిచ్చి నాలుగు నెలల క్రితం వివాహం చేశారు. ఈనెల 18న మధ్యాహ్నం బ్యాంకుకి వెళ్తున్నానని చెప్పిన సునీత ఇంటికి తిరిగి రాలేదు. తల్లి పిల్లి నాగమణి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించటం అభినందనీయం

క్రోసూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా తరుచుగా జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించటం అభినందనీయమని క్రోసూరు ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన వారికి ఆమె నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడాప్ ప్రాజెక్టు అధికారి నాగుల్, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్లు అంజిరెడ్డి, వీరాంజనేయులు, రామకృష్ణారెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డేవిడ్ రాజు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు 120 మంది హాజరు

పిడుగురాళ్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి జాబ్ మేళాకు 120 మంది హాజరుకాగా 45 మందిని అర్హత కలిగిన ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరిగిందని జిల్లా ఉద్యోగ కల్పన అధికారి ఎం.రవీంద్రనాయక్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, పిడుగురాళ్ల స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ పి.శ్రీకాంత్, డి.జానీభాష, రమ్య, మస్తాన్ పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ

సత్తెనపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బైక్ నడిపే ప్రతి ఒక్కరికి హెల్మెట్ తప్పనిసరి అని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు అన్నారు. హెల్మెట్ వాడకంపై శుక్రవారం పల్నాడు ఎస్పీ కే.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డీఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో శుక్రవారం హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న హనుమంతరావు మాట్లాడుతూ బైక్ నడిపే ప్రతి వాహనదారుడు, వెనుక కూర్చునే వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. పట్టణ, రూరల్ సీఐలు బ్రహ్మయ్య, సుబ్బారావు, పట్టణ ఎస్‌ఐ సంధ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

సత్తెనపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ అంబేద్కర్ గురించి అనుచిత వ్యాఖ్యలు చేయటానికి నిరసనగా శుక్రవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన, అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో అమిత్ షా ముదుపుల వ్యవహారాన్ని లేవనెత్తటంతో జీర్ణించుకోలేని అమిత్ షా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురించి అనుచిత వ్యాఖ్యలు చేయటం తగదన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు చుక్కా చంద్రపాల్, దాసరి జ్ఞానరాజ్‌పాల్, చాంద్ బాషా, మాదంశెట్టి వేదాద్రి, కొత్త లక్ష్మయ్య, కోట ఆనంద్, కోడిరెక్క దేవదాసు, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

కలెక్టర్ అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

సత్తెనపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెన్నాదేవిలో గల అంగన్ వాడీ కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ పీ.అరుణ్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని పిల్లలతో మాట్లాడారు. పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందిస్తున్నారా అని ఆరా తీశారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు సమయపాలన పాటించాలని, పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను అందించాలన్నారు. ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి ఉన్నారు.

ఉన్నత పౌరులుగా కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్రీయ విద్యాలయం విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దుతుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం వద్ద గల కేంద్రీయ విద్యాలయంలో శుక్రవారం వార్షిక వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. 10వ తరగతిలో మొదటి స్థానం వచ్చిన విద్యార్థులకు, నేషనల్ లెవల్ అండర్-19 బాలికల వాలీబాల్ పోటీల్లో విజేతలకు కన్నా జ్ఞాపికలను, బహుమతులను అందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ కన్నాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి : ఎంపీపీ

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎంపీపీ షేక్ యలవర్తిపాటి జై భూన్‌బీ అన్నారు. మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో శుక్రవారం జరిగింది. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రస్తుతం హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వే, మిస్సింగ్ సిటిజన్ లను హౌస్ హోల్డ్‌లకు యాడ్ చేయటం, ఎన్‌పీసీఐ లింకింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టిందని, ఈ సర్వేలకు ప్రజలు సహకరించాలన్నారు. ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఏ.శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జ్ ఏడీఏ శ్రీధర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ధాన్యం కొనుగోలు చేస్తాం : ఏవో

దాచేపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ-క్రాప్ ద్వారా నమోదు చేసుకున్న రైతుల ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని దాచేపల్లి వ్యవసాయ శాఖ ఏవో పాపకుమారి తెలిపారు. నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యాన్ని శుక్రవారం పరిశీలించారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి అనంతరం రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, భయపడాల్సిన అవసరం లేదని ఆమె వివరించారు.

గాయ పడ్డ వ్యక్తి మృతి

అచ్చంపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చామర్రు గ్రామానికి చెందిన చిలకా ప్రసాదరావు(40) గుంటూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. వారం రోజుల క్రితం దోసపాటి చెరువు వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గుంటూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందాడు. చామర్రులో చిలక ప్రసాదరావు మృతదేహాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, సమన్వయ కమిటీ సభ్యులు మొక్కపాటి గిరిబాబు, కొనకంచి యజ్ఞ ప్రసాదు, నందిగం నాగేశ్వరరావు, సాయిబాబు, తిరువాయిపాటి ఆంజనేయులు, నాని సందర్శించి నివాళులర్పించారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా 'పులుకూరి'

● 'యరపతినేని' చొరవ తో కాంతారావు పేరు ఖరారు



పులుకూరి కాంతారావు

పిడుగురాళ్ల, దాచేపల్లి,డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రతిష్టాత్మకమైన నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి గురజాలకు చెందిన టీడీపీ సీనియర్ నేత పులుకూరి కాంతారావును వరించింది. శుక్రవారం ముఖ్యమంత్రి కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా కాంతారావు పేరును ఖరారు చేశారు. ఈ సమావేశంలో పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీనియర్ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో పాటు పార్టీ కి చెందిన సీనియర్ నేతలు పాల్గొన్నారు. పదవికి పలువురు పోటీలో ఉన్నప్పటికీ పులుకూరి కాంతారావును ఎంపిక చేయటంలో గురజాల ఎమ్మెల్యే కీలక పాత్ర పోషించారు. గురజాల నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడిన కాంతారావుకు ఈ పదవిని కేటాయించాలని యరపతినేని సీఎం వద్ద గట్టిగా పట్టుపట్టారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి కాలం ఐదేళ్లు. ఈ పదవి కోసం ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు, ప్రకాశం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, నేతలు తీవ్రంగా పట్టుపట్టారు. ఎట్టకేలకు అందరినీ ఒప్పించి తన నియోజకవర్గానికి చెందిన పులుకూరి కాంతారావు పేరును ఖరారు చేయించటంలో యరపతినేని కృతకృత్యులయ్యారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన పులుకూరి కాంతారావు గతంలో గురజాల ఎంపీపీగా పనిచేశారు. పార్టీ కష్టకాలంలోనూ ఆయన యరపతినేని వెంటే వున్నారు. ఆ నేపథ్యమే పులుకూరికి ఉన్నత పదవిని తీసుకొచ్చింది. పులుకూరి కాంతారావు పేరును సీఎం స్థాయిలో ఓకే చేయించేందుకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తన సొంత అత్త పెద్ద కర్మ కార్యక్రమానికి కూడా గైరా జరయ్యారు. ఇదే నియోజకవర్గంలోని మిగిలిన డీసీ చైర్మన్‌ల ఎంపికలోనూ పార్టీలోని సీనియర్ నాయకులకు పెద్ద పీట వేశారు. గురజాలలో 3 నెంబర్ డీసీ చైర్మన్‌గా యాగంటి రామారావు, దాచేపల్లి మండలం నుంచి కాపు సామాజిక వర్గానికి చెందిన పగడాల భాస్కరరావు, పిడుగురాళ్ల మండలం నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన గండికోట వెంకటేశ్వర్లును ఎంపిక చేశారు.

కృష్ణా నదిలో ఆగని ఇసుక అక్రమ రవాణా

● గృహ నిర్మాణాల కోసం అంటున్న లారీ డ్రైవర్లు

● లారీలు వదిలి కొంతమంది పరార్



గారపాడు వద్ద ఇసుక లారీలను స్వాధీనం చేసుకున్న డీఎస్పీ టీం, లోకల్ పోలీసులు

పెదకూరపాడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని కృష్ణానదిలో ఇసుక అక్రమ రవాణా అంతేలేకుండా పోతుంది. ఈనెల 10న విజిలెన్స్ ఐజి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా అధికారులు నియోజకవర్గంలోని ఇసుక రీచ్‌లపై దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో అచ్చంపేట మండలం అంబడిపూడి, అమరావతి మండలం మల్లాది రీచ్‌లో నదీ గర్భంలోకి వెళ్లి అక్రమంగా తరలిస్తున్న జేసీబీలను, లారీలను సీజ్ చేసి ఆయా పోలీస్ స్టేషన్లకు అప్పగించారు. ఆగని ఇసుక అక్రమ రవాణాదారులు శుక్రవారం రాత్రి అమరావతి మండలం మల్లాది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పెదకూరపాడు మండలం గారపాడు దగ్గర సత్తెనపల్లి డీఎస్పీ బృందం, లోకల్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా 13 లారీలలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించి లారీలను పెదకూరపాడు పోలీస్ స్టేషన్లకు తరలించారు. వారి వద్ద ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్నట్టు గుర్తించారు. ఈ క్రమంలో కొందరు లారీ డ్రైవర్లు పరారైనట్లు తెలిసింది.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి రామాంజీపురంలో పాఠశాల

● డీఈవో చంద్రకళ

బెల్లంకొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యా సంవత్సరం నుంచి రామాంజీపురంలో పాఠశాల జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని డీఈవో చంద్రకళ అన్నారు. మండలంలోని రామాంజీపురం గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో చర్చించారు. వచ్చే సంవత్సరం నుంచి వీలైనంత త్వరలో రామాంజీపురం గ్రామంలో పాఠశాల ను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆమె సూచించారు. గ్రామంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు?, చదువుకునేందుకు ఎక్కడికి వెళ్తున్నారు?, ఎంత మంది చదువులు మానేశారనే విషయాన్ని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం వెంకటాయపాలెం గ్రామ పాఠశాలను సందర్శించి అక్కడ ఉన్న వసతులను, చదువులపై విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. ఆమె వెంట ఎంఈవోలు శ్రీనివాసరావు, బాలచంద్రరావు, ఎంఆర్‌సీలు నరసింహారావు, సాంబశివరావు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న తేజస్విని

స్వర్ణాంధ్ర సాధనలో యువతే కీలకం

- రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక విభాగం చైర్‌పర్సన్ బోడపాటి తేజస్విని
- హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం

గుంటూరు (విద్య), డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): దేశంలో 60 శాతంపైగా ఉన్న యువత, విద్యార్థులు స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మాణంలో కీలకం కావాలనీ, అకుం ఠిత దీక్షతో పాలుపంచుకోవాలనీ, ఇందుకు చదువు తోపాటు క్రీడలు, సాంస్కృతిక అంశాలను ఉపయోగిం చుకోవాలని రాష్ట్ర సృజనాత్మ కత, సాంస్కృతికవిభాగాల కమిషన్ చైర్ పర్సన్ బోడపాటి తేజస్విని అన్నారు. గుంటూరు అమరావతి రోడ్డులోని హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు "ఆదర్శ్ 2024 స్పోర్ట్స్ ఫర్ హార్మనీ"ను ఆమె శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. తేజస్విని తొలుత క్రీడోత్సవ పతాకాలు ఆవిష్కరించిన అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి పావురాలను ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు.

అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తేజస్విని మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా అంతర్జాతీయ ఒలింపిక్స్ దేశంలో త్వరలో నిర్వహించుకోబోతున్న సందర్భంగా ప్రధాని మోడీ ఆశిస్తున్న అత్యున్నత క్రీడా ప్రమాణాలతో కూడిన క్రీడాకారులు తయారవ్వాలని కోరారు. క్రీడాకారులు, యువతరం డాక్టర్ అబ్దుల్ కలాం, సచిన్ టెండూల్కర్, పీవీ సింధు, హారిక లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. బాలికల కబడ్డీ పోటీలను ప్రారంభించి తేజస్విని స్వయంగా ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ కేవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఘనత వహించిన రమణరావు, ఎమ్మెస్కే ప్రసాద్ లాంటి జాతీయస్థాయి క్రీడాకారులు హిందూ విద్యా సంస్థలలో పూర్వ విద్యార్థులేనన్నారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న క్రీడోత్సవాలకు 25 కళాశాలల నుంచి 500 మంది ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.ఐజక్ ప్రసాద్ మాట్లాడుతూ కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, చెస్, క్యారమ్స్ వంటి క్రీడలతోపాటు వారి మానసిక వికాసానికి దోహదపడే సాంస్కృతిక అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, డాక్టర్ కొల్లా సుస్మితా చౌదరి, ఫిజికల్ డైరెక్టర్ కోసూరి రవి తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న తేజస్వినీ



విద్యార్థిని నృత్య ప్రదర్శన



క్రీడాకారుల్ని పరిచయం చేసుకుంటున్న తేజస్విని



విద్యార్థినీ, విద్యార్థుల మైమ్ ప్రదర్శన



బాల్య బంధనాలు

పద్దెనిమిది ఏళ్లంటే ఏమీ తెలియని వయస్సు. ఆ వయస్సులోనే జిల్లాలోని బాలికలు భార్యలు వుతున్నారు. పద్దెనిమిది నిండే సరికి చంకలో ఓ బిడ్డ, కడుపులో మరో బిడ్డతో ఉసూరుమంటూ కన్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎడాపెడా జరుగుతున్న బాల్యవివాహాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఊరు, వాడా తేడా లేకుండా ఆడపిల్లలకు సరైన వివాహ వయస్సు రాకుండానే పెళ్లిళ్లు చేస్తున్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో ఈ తరహా బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

- ప్రమాద ఘంటికలు మోగిస్తున్న బాలిక వివాహాలు
- 291 మంది బాలికలు 18 ఏళ్ల లోపే గర్భవతులు
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కాకి లెక్కలు
- ఆరోగ్య శాఖ రికార్డులతో వెలుగులోకి నిజాలు


గుంటూరు సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిన్న వయస్సులోనే లెక్కకు మించిన సంఖ్యలో బాలికలు గర్భవతులు అవుతున్నారని వైద్య, ఆరోగ్య శాఖ చెబుతుంది. 15 సంవత్సరాల వయస్సు నుంచి 18 సంవత్సరాలలోపు గర్భం దాల్చిన వారి సంఖ్య జిల్లాలో రికార్డు స్థాయిలో ఉండటం విశేషం. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మాత్రం బాల్యవివాహాలు అరికడుతున్నట్లు కాకిలెక్కలు చెబుతోంది. బాల్యవివాహాల విషయంలో వైద్య, ఆరోగ్య శాఖ లెక్కకు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ లెక్కకు పొంతన ఉండటం లేదు.

ఆధార్‌తో అసలు లెక్క...

గర్భవతుల నమోదుకు వైద్య, ఆరోగ్య శాఖ ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటుంది. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు కొత్తగా వివాహమైన జంటను ప్రతిరోజూ పర్యవేక్షించి నెల తప్పిన వారిని ఏఎన్ఎం దగ్గరకు తీసుకొస్తారు. అక్కడ తగిన పరీక్షలు నిర్వహించిన అనంతరం గర్భవతిగా నమోదు చేస్తారు. అందుకోసం ఆధార్ కార్డును తీసుకుని అందులోని వివరా లనే ఆన్‌లైన్ చేస్తున్నారు. ఆవిధంగా నమోదు చేయడం ద్వారా జిల్లాలో చిన్న వయస్సులోనే గర్భవతులు అయిన వారి వివరాలు వెల్లడవు తున్నాయి. ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం ఈ ఏడాది ఆగస్టు నెల వరకు 291 మంది బాలికలు 18 ఏళ్లలోపే గర్భందాల్చారు. 15 ఏళ్లకే గర్భం దాల్చిన వారు 8 మంది, 16 ఏళ్లకు 24 మంది, 17 ఏళ్లకు 103 మంది, 18 ఏళ్లకు 155 మంది గర్భం దాల్చారు. వీరంతా ప్రస్తుతం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టీకాలు పొందుతున్నారు.

పొంతనలేని లెక్కలు...


జిల్లాలో జరుగుతున్న బాల్య వివాహాలపై స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కూడా కొన్ని లెక్కలు సిద్ధం చేసింది. కానీ అవేవీ వాస్తవానికి దగ్గరగా లేవు. బాల్య వివాహాలు తాము నిలిపివేయించినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్న మాటల్లో వాస్తవం లేనట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. ఈ ఏడాది జనవరి నెల నుంచి ఇప్పటి వరకు 35 బాల్య వివాహాలు నిలుపుదల చేసినట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఆ శాఖకు చెందిన ఆరు ప్రాజెక్టులకుగానూ పొన్నూరు, గుంటూరు, మంగళగిరి ప్రాంతాల్లోనే ఎక్కువ బాల్యవివాహాలు నిలిపివేసి నట్లు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉంది. ఉదాహరణకు పెదనంది పాడు మండలం ఉప్పల పాడుకు చెందిన బాలికకు వివాహం జరుగుతుండగా ఆపివేసినట్లు రికార్డులో చూపించారు. వాస్తవానికి ఆ బాలికకు వివాహం జరిగింది. గుంటూరు నగర పరిధిలోని మరో బాలిక వివాహం అడ్డుకున్నట్లు చెబుతున్నా, ఆ బాలికకు కూడా వివాహం జరిగింది. ఆ శాఖ చెప్పిన చాలా మంది బాలికలకు వివాహాలు జరిగిపోయాయి.



అన్నీ ఇబ్బందులే..

ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతున్న వివరాల ప్రకారం 15 నుంచి నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలు, బాలికల మరణానికి గర్భం దాల్చటమే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఆ వయస్సులో పెళ్లి, గర్భం అంటే ఆడపిల్ల జీవితానికి బలవంతపు మరణ శాసనం రాసినట్లు భావించాలి. ఎదిగీ ఎదగని వయస్సులో బిడ్డలకు జన్మనివ్వటం వలన అనేక రకాల భౌతిక, మానసిక, ఆరోగ్య సమస్యలు బాలికలను చుట్టుముడుతు న్నాయి. అందువల్లే బాల్యవివాహాలను నిరోధించేందుకు ప్రభుత్వం 2006లో ప్రత్యేక చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. అయినా బాల్యవివాహాలు ఆగకపోవటం సామాజిక సమస్యగా పరిణమిస్తోంది.

పాఠశాల స్థాయిలోనే జరుగుతున్న ప్రేమ వ్యవహారాల వల్ల జిల్లాలో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ మధ్య కాలంలో జరిగిన అనేక బాల్యవివాహాల నేపథ్యం ప్రేమ వ్యవహారమే కనిపిస్తుంది. తల్లిదండ్రుల పేదరికం, నిరక్షరాస్యత వంటివి బాల్యవివాహాలను ప్రోత్సహిస్తున్నాయి.



సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

- కలెక్టర్ పి.అరుణ్ బాబు

నరసరావుపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. జిల్లాలో ముఖ్యమంత్రి తొలి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సీఎం పర్యటన ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. గురజాల మండలం, పులిపాడు గ్రామంలో 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ, గ్రామసభ కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారని ఇందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా, నాణ్యమైన పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. పర్యటనలో పాల్గొనే ప్రజల కోసం తగిన వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని చెప్పారు.



సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

మూడో శనివారం స్వచ్ఛాంధ్ర

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర ఆశయాలకు తగ్గట్టు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యాలయాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఘన వ్యర్థాలను తొలగించడం చేయాలన్నారు. పౌర సేవలు నిర్లక్ష్యం చేయకుండా శనివారం ఉదయం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో మురళి, అధికారులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక బృందాలు

- పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఎస్పీ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధి తులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలనీ, సున్నితమైన భాషతో మాట్లాడాలని సూచించారు. మహిళలు, బాలికలు, చిన్నారుల ఫిర్యాదులపై వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించి డాక్యుమెంట్లు అప్లోడ్ చేయాలన్నారు. పోక్సో, మహిళలపై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ఆస్తి కేసులు, మిస్సింగ్ కేసులు దర్యాప్తు త్వరగా పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విచారణ దశలో ఉన్న కేసులను సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాన్ని ఉపయోగించి వేగవంతంగా దర్యాప్తు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేయాలన్నారు. కోర్టులో విచారణ సక్రమంగా జరిగే విధంగా సంబంధిత డీఎస్పీలు, సీఐ, ఎస్‌హెచ్‌వోలు స్వయంగా పర్యవేక్షించుకోవాలన్నారు. సమావేశంలో పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్, సీసీఎస్ అదనపు ఎస్పీ లక్ష్మీపతి, ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజు, నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరావు, సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు, గురజాల డీఎస్పీ జగదీష్, ఎస్‌బీ సీఐలు బి.సురేష్, బాబు, పి.శరత్ బాబు, సీఐలు ఎస్ఐలు పాల్గొన్నారు.

రేపు పెనుగొండకు అభినందన సభ

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైన సందర్భంగా జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11 గంటలకు గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో అభినందన సభను ఏర్పాటు చేస్తున్నట్లు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వక్తలుగా మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, ప్రముఖ రచయిత్రి, విశ్రాంత ప్రిన్సిపాల్ సీహెచ్. సుశీలమ్మ, హిందూ కళాశాల తెలుగు శాఖాధిపతి యల్లాప్రగడ మల్లి కార్జునరావు తదితరులు ప్రసంగిస్తారన్నారు.

పెనుగొండ లక్ష్మీనారాయణ 1972 నుండి అరసంలో పలు బాధ్యతలు నిర్వహించి 2023 లో జాతీయ అధ్యక్షుడుగా ఎన్నికై 1972లో సమిధ అనే కవితతో తన సాహితీ ప్రస్థానాన్ని పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రారంభించారన్నారు. దీపిక గ్రంథం తెలుగు పరిశోధకులకు కరదీపిక లాంటిది అన్నారు.

పరీక్షా కాలమ్



పరిశీలన, అవగాహన, సృజనతో అత్యధిక మార్కులు సాధ్యం

'పదో తరగతి విద్యార్థులు సాంఘిక శాస్త్రం సబ్జెక్టు అంటే భయపడుతుంటారు. అలాగే కొంతమంది ఈ సబ్జెక్టును చాలా తేలికగా తీసుకుంటారు. ఇది సరైన విధానం కాదు. కొద్దిగా కష్టపడితే ఈ సబ్జెక్టులో గణితంతో పాటు దీటుగా మంచి మార్కులు తెచ్చుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి' అని చెబుతున్నారు బీవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత ప్రత్తిపాడు(గుంటూరు) స్కూల్ అసిస్టెంట్ డీ. కుసుమకుమార్.

గుంటూరు (విద్య), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాంఘిక శాస్త్రంలో ప్రధానంగా మ్యాపులు, చరిత్ర, అర్థశాస్త్రం, పౌరశాస్త్రం, భూగోళశాస్త్రం వంటి కీలక అంశాలకు సంబంధించిన పాఠాలు ఉంటాయి. విద్యార్థులు వాటి అభ్యసనపై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టాలి. ఒక ప్రణాళిక బద్ధంగా పరీక్షలకు సిద్ధం అయితే సాంఘికశాస్త్రంలో అత్యధిక మార్కులు తెచ్చుకునే అవకాశం ఉంది. కొంత మందికి ఈ సబ్జెక్టు కొరుకుడు పడని విధంగానే ఉంటుంది.. అయినా కొద్దిగా శ్రద్ధ చూపితే మెరుగైన ఫలితాలు ఉంటాయి.

- తొలుత విద్యార్థులు సబ్జెక్టు పట్ల సరైన దృక్పథం కలిగి ఉండాలి. సాంఘిక శాస్త్రంలో ప్రస్తుతం నాలుగు పాఠ్యపుస్తకాలు ఉన్నాయి. ఇందులో చరిత్ర, పౌరశాస్త్రం, భూగోళశాస్త్రం, ఆర్థిక శాస్త్రానికి సమాన ప్రాధాన్యం ఉంది.
- ఇందులో ప్రతి అంశాలనికి 25 మార్కులకు ప్రశ్నలు చొప్పున మొత్తం 100 మార్కులకు పేపర్ ఇస్తారు. ముందుగా సిలబస్‌ను ఒక క్రమ పద్ధతిలో విభజన చేసి ప్రణాళికతో రివిజన్ చేయాలి.
- సెక్షన్ 1లో భిన్న రకాల బిట్స్ ఇస్తారు. ఇవి నాలుగు సబ్జెక్టు మీద ఉంటాయి. సమాచార నైపుణ్యాల పై పట్టు సాధించాలి. భూగోళం, అర్థశాస్త్రంలో చర్చించిన సమస్యలు ఉంటాయి. ఉదాహరణకు వనరులు, వాటి వినియోగం, సంరక్షించుకోవడం తదితర అంశాలు ఉంటాయి. వాటిపై పూర్తి అవగాహన ఉండాలి. ఇంకా జల వనరులు, వాటి సంరక్షణ, కాలుష్యం నుంచి రక్షించుకోవడం వంటి అంశాలపై ప్రశ్నలు ఉంటాయి.
- ఫలితాలు, సమస్యా నివారణలను పూర్తిగా అవగాహన చేసుకోవాలి. ఉదాహరణకు భారతదేశ, ప్రపంచంలో ఉన్న సమాచారంపై ప్రశ్నలు వస్తాయి. ఆయా భౌగోళిక పటాలపై సమాచారం తో కూడిన అవగాహన ఉండాలి.
- సమస్యలను ఇచ్చి సొంతంగా ప్రతి స్పందనలను నమోదు చేయండి.. అంటే అలాంటి వాటికి సమాధానాలు ఇచ్చే విధంగా తర్ఫీదు పొందాలి. ఉదాహరణకు.. మీకు పత్తి బాగా పండింది. అయితే ధర లేదు.. మీరు ఏం చేస్తారు. వంటి ప్రశ్నలు ఇస్తారు. అంటే వ్యవసాయం, రైతుల పరిస్థితిపై అవగాహన ఉండాలి
- పట్టికలను, గ్రాఫులును ఇచ్చి వాటిపై ప్రశ్నలు అడుగుతారు. వాటిని సరిగ్గా అర్థం చేసుకోని సమాధానాలు రాయాల్సి ఉంటుంది. జనాభా లెక్కలు, వ్యాధులు, రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి. ఆర్థిక పరమైన అంశాలు వంటి పట్టికలు, గ్రాఫులు వచ్చే అవకాశం ఉంది.
- ఒక ముఖ్యమైన పేరాగ్రాఫ్ ఇచ్చి వాటిలో ముఖ్యమైన అంశాలపై కామెంట్ చేయమని అడుగుతారు. ఇలా విద్యార్థిలో సృజనాత్మకత, పరిశీలన, సమయస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, సామాజిక స్పృహ వంటి అనేక అంశాలను దృష్టిలో పెట్టుకుని ప్రశ్నలు ఉంటాయి. ఇలాంటి సొంత ప్రతి స్పందనలపై ప్రశ్నలు వస్తాయి.
- చివరగా విద్యార్థి పరీక్షా కేంద్రంలోకి వెళ్ళగానే ముందుగా ప్రశ్నపత్రాన్ని పూర్తిగా ఒకటికి రెండుసార్లు చదువు కోవాలి. ముందుగా బాగా వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రావాలి. ప్రశ్న పత్రంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయడానికి ప్రయత్నించాలి. పరీక్ష పూర్తయ్యే వరకు కేంద్రంలోనే ఉండాలి. జవాబు పత్రాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలి. తప్పులు ఉంటే సరిచేసుకోవాలి



డీ సుకుమకుమార్,
స్కూల్ అసిస్టెంట్,
బివిఆర్ జడ్పీస్కూల్
ప్రత్తిపాడు (గుంటూరు)

నాలుగుపళ్ల విభాగంలో
ప్రకాశం జిల్లా ఎడ్ల జత ప్రథమం

- కొనసాగుతున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

గురజాలటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని గురజాల పట్టణంలోని నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో శుక్రవారం నాలుగుపళ్ల విభాగంలో పోటీలు జరిపారు. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం కాజీపురం గ్రామానికి చెందిన వేగినాటి ఓసురారెడ్డి ఎడ్లజత నిర్ణీత సమయంలో పందెపు బండను 4780.7 అడుగుల దూరం లాగి ప్రథమస్థానంలో నిలిచింది.

అలాగే పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం చాగంటి శ్రీనివాసరావు ఎడ్లజత 4600 అడుగులతో సంయుక్తంగా రెండోస్థానం, గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటపాలెంకు చెందిన రామినేని రత్తయ్య చౌదరి ఎడ్లజత 4230.10 అడుగులతో మూడోస్థానం, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా మేళ్లచెరువుకు చెందిన వీరంరెడ్డి కార్తీక్‌రెడ్డి ఎడ్లజత 4024.8 అడుగులతో నాలుగోస్థానం, గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం కండ్రికకు చెందిన కేలం పద్మనాయుడు ఎడ్లజత 3933.3 అడుగులతో ఐదోస్థానంలో నిలిచాయి.



నాలుగుపళ్ల విభాగంలో ప్రథమస్థానం సాధించిన ప్రకాశం జిల్లా ఎడ్లజత

స్కేటర్ జెస్సీరాజ్‌కు
కేంద్ర ప్రభుత్వ పురస్కారం

- ప్రత్యేకంగా అభినందించిన రాష్ట్ర మంత్రి లోకేశ్

మంగళగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికి చెందిన అంతర్జాతీయ స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సీరాజ్‌కు ప్రతిష్ఠాత్మకమైన ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2025 అవార్డు లభించింది. ఈ నెల 26వ తేదీన ఢిల్లీలోని రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనుంది. జెస్సీరాజ్ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి నుంచి ఆసియా కప్, ప్రపంచ కప్ పోటీల్లో రాణిస్తూ దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసింది. ఇప్పటివరకు 50 పతకాలను తన ఖాతాలో వేసుకుంది. ఈ ఏడాది న్యూజిలాండ్‌లో జరిగిన ప్రపంచ ఓషియానిక్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. జెస్సీరాజ్‌ను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌ను ప్రతి ఏటా దేశంలోని 25 మంది చిన్నారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. వివిధ అంశాల్లో విభిన్న ప్రతిభ చూపిన చిన్నారులను జ్యూరీ పారదర్శకంగా ఈ పురస్కారానికి ఎంపిక చేస్తుంది. 2025 సంవత్సరానికి సంబంధించి కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ జాబితాను ప్రకటించింది. క్రీడా విభాగంలో జెస్సీ రాజ్ పేరును ఎంపిక చేయడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడ పటమటలోని ఎన్ఎస్ఎం స్కూల్ జెస్సీరాజ్ ప్రస్తుతం 9వ తరగతి చదువుతోంది. ఈ ఏడాది కేంద్ర బాల పురస్కార్‌కు జెస్సీరాజ్‌ను ఎంపిక చేయాలని కోరుతూ మంత్రి లోకేశ్ కేంద్రానికి లేఖ రాశారు. మంత్రి లోకేశ్ చొరవతో కేంద్రం ఈ అవార్డుకు ఎంపిక చేసిందని జెస్సీరాజ్ తల్లిదండ్రులు రాధ, సురేష్ తెలిపారు.



మంత్రి లోకేశ్‌తో జెస్సీరాజ్

ఏపీవోగా లక్ష్మణ్ బాధ్యతల స్వీకారం

బొల్లాపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కేంద్రం బొల్లాపల్లి ఏపీవోగా ఎం.లక్ష్మణ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈపూరులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న లక్ష్మణ్ బొల్లాపల్లి ఏపీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ గ్రామీణ పథకంలో ప్రతి ఒక్కరికి పనులు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామీ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

జనవరి, ఫిబ్రవరిలలో మాత్రమే లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి: ఎస్‌టీవో

చిలకలూరిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 లోపు మాత్రమే ప్రభుత్వ పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను అందచేయాలని చిలకలూరిపేట సబ్ ట్రెజరీ అధికారి బి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈలోపు ఇచ్చే లైఫ్ సర్టిఫికెట్లు చెల్లవని ఆయన పేర్కొన్నారు. పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను ట్రెజరీ కార్యాలయంలో గాని, కంప్యూటర్ లేకుంటే టచ్ ఫోన్ పరిజ్ఞానం ఉంటే స్వయంగా గానీ, నెట్ సెంటర్ల ద్వారా గాని, కంప్యూటర్ సదుపాయం ఉన్న పోస్ట్ ఆఫీస్ ద్వారా కానీ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను ఇవ్వవచ్చునని ఆయన వివరించారు. ఆధార్ నెంబర్ లింక్ అయిన మొబైల్ ఫోన్ దగ్గర ఉంచుకొని ఓటీపీతో లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రొంపిచర్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో మాధ్యూబాబు శుక్రవారం తెలిపారు. మండలంలోని అభివృద్ధి అంశాలపై, శాఖల వారీగా జరుగుతున్న పనులపై సమీక్ష జరుగుతుందన్నారు. మండలంలోని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలోని రాజీవ్ గాంధీ కాలనీలో విద్యుత్ స్తంభాల మార్పిడి, లైన్‌ల మరమ్మతుల వల్ల ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు రాజీవ్‌గాంధీ కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు.

రేపు సాతులూరులో వైద్య శిబిరం

నాదెండ్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుంటూరుకు చెందిన చంద్రా హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ శరత్‌చంద్ర కుమార్, పాటిబండ్ల శివాజీ, మహమ్మద్ సాజిద్ జమీన్, పీఆర్ఎస్.శ్రీరాములు వివిధ రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని బి.సత్యనారాయణ తెలిపారు.

'అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి'

రొంపిచర్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమాన పరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని దళిత బహుజన హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు గోదా రమేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నలగార్లపాడులోని అంబేద్కర్ నగర్‌లో ఆయన మాట్లాడుతూ అమిషాను మంత్రి పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

బొల్లాపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా సీతారామయ్య బాధ్యతల స్వీకారం

బొల్లాపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పీ సీతారామయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన జిలానీ బాషా సస్పెండ్ అవ్వటంతో ఈపూరు ఎంపీడీవో ప్రభాకరరావు ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తుండగా ఆయన స్థానంలో శావల్యాపురంలో పని చేస్తున్న సీతారామయ్యకు ఇన్‌చార్జ్ ఎంపీడీవో బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకు వెళ్తామన్నారు. మండలంలో సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే తక్షణమే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలో ఆధార్ కేంద్రం

నూజెండ్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చొరవతో కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీలో శుక్రవారం ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపు నిర్వహించారు. ఎస్టీ కాలనీ వాసులకు, వారి పిల్లలకు ఆధార్ కార్డులు లేకపోవటంతో విద్య, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందటం లేదని, వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ఆధార్ క్యాంపు ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గంగినేని బాబు, కంచుమాటి నరేష్, బచ్చు అంజిరెడ్డి, మరిడి సురేష్ పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమావేశం

వినుకొండ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివయ్య భవన్‌లో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ వినుకొండ సబ్ డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో కాంట్రాక్టుగా పనిచేస్తున్న ఉద్యోగులను సంస్థలో పర్మినెంట్ చేయాలని, దళారీ వ్యవస్థను రద్దుచేయాలని, కార్మికులకు రావాల్సిన పీఆర్‌సీ, అరియర్స్‌ను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా స్మార్ట్ మీటర్లు బిగించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, స్మార్ట్‌మీటర్ బిగించే ప్రయత్నం చేస్తే పోరాటం చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి. శ్రీనివాసరావు, రాము, కొటారి కృష్ణ, భగవాన్, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పిచ్చి మొక్కల నడుమ పూడుకుపోయిన మైనర్ కాల్వలు

అడవిని తలపిస్తున్న మైనర్ కాల్వలు

- నీరు ప్రవహించే పరిస్థితి లేక రైతుల ఇక్కట్లు
- చివరి భూములకు నీరు అందర రైతన్నల లబోదిబో

వినుకొండ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెరుమాళ్ళపల్లి మేజర్ కాల్వకు గత కొంతకాలంగా అడవిని తలపిస్తున్న చెట్లతో పంట కాలువలకు నీరు చేరని పరిస్థితి నెలకొంది. నాగార్జునసాగర్ కుడి కాల్వపై అగ్నిగుండాల నుంచి పెరుమాళ్ళపల్లి మేజర్ గుండా జంగాలపల్లి వరకు రైతులకు కాల్వ ద్వారా సాగునీరు అందించాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కాల్వలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పంట కాల్వలు అడవిని తలపిస్తున్నాయి. వినుకొండ రైల్వే బ్రిడ్జి వద్ద నుంచి జంగాలపల్లి వరకు ఉన్న మేజర్ కాల్వలపై మైనర్ తూములకు నీరు చేరకపోవడంతో రైతులు నీటికోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాల్వలో పూడికతీత పనులు చేపట్టకపోవడం, ఏపుగా పెరిగిన పిచ్చిచెట్లను తొలగించకపోవడంతో మైనర్ కాల్వల పరిస్థితి రోజురోజుకుడ అధ్వానంగా మారుతున్నాయి. అంతేకాకుండా రైతులు నీటి కోసం కాల్వలపై వెళ్ళాలన్నా పిచ్చిమొక్కలతో అడవిని తలపిస్తోంది. ఈ ప్రాంతంలో ఆరుతడి పంటలపై సాగుచేస్తున్న మిర్చి, పొగాకు పంటలు అధికంగా ఉండడంతో నీటికోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి కాల్వలకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు తొలగించడంతోపాటు కాల్వ పూడికతీత పనులు చేపట్టి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

హెల్మెట్ ధరించండి ప్రాణాలను కాపాడుకోండి

- ఎస్పీ కంచి శ్రీనివాసరావు



హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, డిసెంబర్ 20, హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శుక్రవారం పిలుపునిచ్చారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నరసరావుపేట డీఎస్పీ కె నాగేశ్వరావు పర్యవేక్షణలో శుక్రవారం పట్టణంలోని మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ట్రిబుల్ రైడింగ్, సీట్‌బెల్ట్ పెట్టుకోని వారిపై, మైనర్లు వాహనాలు నడిపితే వారిపై కూడా చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలవల్ల మరణించే వారిలో ఎక్కువగా తలకు గాయాలై చనిపోవడం జరుగుతుందన్నారు. దాని నివారణకు ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడపడం వల్ల తలకు ఒక రక్షణ కవచంగా ఉపయోగపడుతుందని తెలిపారు. హెల్మెట్ ధరించడం వలన మెదడుకు తీవ్రమైన గాయం, మరణాల రేటు తగ్గుతుందని అధ్యయనా లు సూచిస్తున్నాయన్నారు. తల, ముఖం, మెదడు లకు బలమైన గాయాలు కాకుండా హెల్మెట్ రక్షిస్తుందన్నారు. ర్యాలీలో పల్నాడు జిల్లా అడ్మిన్ ఏఎస్పీ జేవీ సంతోష్, నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ లోకనాథం, సబ్ డివిజన్‌లోని సీఐలు బలగాని ప్రభాకర్, శోభన్‌బాబు, పి.రమేష్, ఎం.హైమారావు, ఎంవీ చరణ్, రామకృష్ణ, ఎస్ఐలు సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు డాక్టర్ అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం ప్రవీణ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు

ఏసు ప్రభువు బోధనలను పాటించాలి

సెమీ క్రిస్మస్ వేడుకల్లో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏసు ప్రభువు బోధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చీఫ్‌విప్‌గా మొదటిసారి జిల్లా కార్యాలయంకు వచ్చిన జీవీ ఆంజనేయులును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని, లోక కల్యాణం జరగాలని ఆకాంక్షించారు. చంద్రబాబునాయుడు ఆకాంక్ష విజన్ 2047 నెరవేరాలన్నారు. ముందుగా క్రిస్మస్ కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అధ్యక్షత వహించారు.

కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, నాగౌతు శౌరయ్య, మర్రి రెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, బీమినేని వందనాదేవి, కనుమూరి లక్ష్మి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పులిమి వెంకటరామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, వెన్నా సాంబశివారెడ్డి, షేక్ కరిముల్లా, తురక వీరాస్వామి, ఎల్లినేడి రామస్వామి, ఇనగంటి జగదీష్, దాసరి ఉదయశ్రీ, బండారుపల్లి విశ్వేశ్వరరావు, వాసిరెడ్డి రవీంద్ర, టీడీపీ రాష్ట్ర విభిన్న ప్రతిభవంతుల అధ్యక్షుడు పూదోట ఆంథోని సునీల్ కుమార్, టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్‌కుమార్, గొట్టిపాటి జనార్ధనబాబు, పులుకూరి జగ్గరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో...

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి). మండలంలోని కాకాని వద్ద ఉన్న జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య ప్రవక్తగా పాల్ జోషువా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ సిహెచ్. శ్రీనివాసరావు క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేడుకలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎస్ కిశోరబాబు, డాక్టర్ జి.పి.రాజు, డాక్టర్ కే.విమల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ కార్యాలయంలో...

రొంపిచర్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల డీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సెమీ క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బండి నిర్మల, ఎంపీడీవో మాధ్యూబాబు, డీఆర్‌డీఏ జిల్లా ఉన్నతి కో-ఆర్డినేటర్ జీవన్, పి.జగ్గయ్య, ఎం. రామారావు తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందు చల్లి మొక్క జొన్న పంట ధ్వంసం

రొంపిచర్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లకుంటలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ రైతుకు చెందిన మొక్క జొన్న పంటపై గడ్డి మందును కొట్టారు. దీంతో పంట మొత్తం ఎండిపోయింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన ఖరీదుల వెంకయ్యకు చెందిన రెండు ఎకరాల మొక్క జొన్న పంటపై గడ్డి మందును గుర్తు తెలియని వ్యక్తులు చల్లినట్లు శుక్రవారం తెలిపాడు. సుమారు రూ.50వేలు నష్టం వాటిలినట్టు రైతు పేర్కొన్నాడు. కొద్ది రోజుల క్రితం గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుంటే అతనికి చెందిన కాంక్రీట్ మిల్లర్‌లో నీరు పోసినట్టు వాపోయాడు. తెలుగుదేశం పార్టీలో చురుగ్గా పని చేస్తున్నందుకు కొందరు తనపై ఈ విధంగా నష్టపరుస్తున్నట్లు ఆయన పేర్కొన్నాడు. ఇటువంటి సంఘటనలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరాడు. గ్రామంలో కొద్ది రోజుల క్రితం వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య వాగ్వివాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ఈ సంఘటన చర్చనీయాంశంగా మారింది.



కుట్టుమిషన్లు పంపిణీచేస్తున్న రోటరీ క్లబ్ సేవకులు

వినుకొండలో కుట్టు మిషన్లు పంపిణీ

వినుకొండ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాషువా కళాప్రాంగణ ఆవరణలో రోటరీక్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ వారి ఆధ్వర్యంలో కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజీఆర్ మైనింగ్ ఇన్ఫ్రావారి ఆర్థిక సహకారంతో పట్టణంలోని 15మంది నిరుపేద మహిళలకు సుమారు రూ.1లక్ష 30వేలు విలువచేసే 15 కుట్టు మిషన్లను అందజేసినట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ సుభాస్ చంద్రబోస్‌ల చేతులమీదుగా నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో త్రిపురాపురం మేజర్ డీసీ చైర్మన్ గంగినేని రాఘవ, పీవీ సురేష్, వైవీ నారాయణ, ఎస్‌కే మస్తాన్‌వలి, ఆళ్ళ శ్రీనివాసరావు, చిరుమామిళ్ళ కోటేశ్వరరావు, రమేష్‌బాబు, రాజశేఖరరెడ్డి, అయ్యప్పరెడ్డి, కూచి రామాంజనేయులు, ముత్తినేని గిరి, బత్తుల శ్రీనివాస్, రాజారెడ్డి, రమేష్, వెంకటేశ్వరరెడ్డి, రామన్ తదితరులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ నిర్వాహకులు

ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ...

చిలకలూరిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆరుగురు పేద మహిళలకు జీవనోపాధి నిమిత్తం కుట్టు మిషన్లు ఉచితంగా అందచేశారు. స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నదే ఇన్నర్‌వీల్ క్లబ్ లక్ష్యమని క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని ఈ సందర్భంగా అన్నారు. క్లబ్ పూర్వ అధ్యక్షురాలు పల్లపోతుల విజయలక్ష్మి, పోతినేని పద్మావతి, కందిమళ్ళ భారతి, మండవ పద్మావతి, డాక్టర్ వరలక్ష్మిలతో పాటు సభ్యుల ఆర్థిక సహకారంతో కుట్టుమిషన్లు సేకరించారు. క్లబ్ కార్యదర్శి నార్నె జయలక్ష్మి, దాతలు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇసప్పాలెం ఎన్ఎస్‌పీ కాలువను పరిశీలించిన ఎమ్మెల్యే

నరసరావుపేట రూరల్, డిసెంబరు 20: మండలంలోని ఇసప్పాలెంలోని ఎన్ఎస్‌పీ కాలువ మరమ్మతులకు గురై నీరు వృథాగా పోవడం గమనించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కాలువను పరిశీలించారు. సంబంధిత అధికారులకు మరమ్మతులు చేయాలని ఆదేశాలు జారీచేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో స్పందించిన అధికారులు కాలువకు మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టారు.

రెవెన్యూ సదస్సుకు 39 అర్జీలు

వినుకొండ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు తెలిపారు. మండలంలోని పెదకంచర్లలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రైతుల నుంచి అత్యధికంగా 39 అర్జీలు వచ్చాయి. వారి సమస్యలను పరిష్కారించాలని తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు సూచించారు.

- బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్లలో రెవెన్యూ గ్రామ సభను తహసీల్దార్ ఏ సుధాకర్ శుక్రవారం నిర్వహించారు. సమస్యలు ఏమైనా ఉంటే అర్జీ రూపంలో అందజేయాలన్నారు. సమస్యలను 33 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.
- నూజెండ్ల: మండలంలోని పువ్వాడలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి భూ సమస్యల పరిష్కారానికి తొమ్మిది దరఖాస్తులు అందినట్టు తహసీల్దార్ జీ రమేష్ తెలిపారు.

బైపాస్‌తో చిలకలూరిపేట ప్రజలకు తొలగిన కష్టాలు: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బైపాస్ రోడ్డుతో చిలకలూరిపేట ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తగ్గాయని శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో నుంచి జాతీయ రహదారి ఉన్నప్పుడు బైపాస్ రోడ్డు ఇవ్వకూడదని అప్పట్లో దేశవ్యాప్తంగా నేషనల్ హైవేస్ విధానంగా ఉన్నదన్నారు. అయితే 2014-19 మధ్య కేంద్రంలో రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న శ్యాంబాబు కేంద్ర ప్రభుత్వంతో పోరాడి చిలకలూరిపేట బైపాస్ రోడ్డును మంజూరు చేయించడంలో విజయం సాధించారన్నారు. కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిన ప్రాజెక్టు కూడా ఇదే అన్నారు. రహదారి భూ సేకరణ ఖర్చు 25శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించిన తొలి ప్రాజెక్టు కూడా దేశంలో ఇదేనని చెప్పారు. నేషనల్ హైవే, రాష్ట్ర ప్రభుత్వం కలిసి ఉమ్మడిగా ఒక ఖాతా తెరిచి రైతుల నుంచి సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లించారని ఆయన పేర్కొన్నారు. బైపాస్‌తో చిలకలూరిపేటలో వాహనాల రద్దీ తగ్గి, ప్రమాదాలు తగ్గిపోయాయన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగి, కాలుష్యం సమస్యకు కూడా తెరపడిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం చొరవ వల్ల బైపాస్ త్వరగా ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని చెప్పారు.

జేఎన్‌టీయూ కేలో ప్రారంభమైన వర్క్ షాప్

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జేఎన్‌టీయూ కే ఇంజనీరింగ్ కళాశాలలో డిజైన్ థింకింగ్, ఇన్నోవేషన్‌పై రెండ్రోజుల ఫ్యాకల్టీ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాం శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కేఎల్ యూనివర్సిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అశ్విన్ రౌత్, డాక్టర్ కల్యాణ్ దూసర్లపూడి హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్తగా ప్రవేశపెట్టిన టూల్స్ అండ్ టెక్నిక్స్ గురించి ఇన్నోవేషన్ రంగంలో ఉన్న కొత్త పద్ధతుల గురించి తెలిపారు. సుమారు 50 మంది ఫ్యాకల్టీ, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

సైనిక సంక్షేమ నిధికి ఎన్‌ఈసీ విరాళం అందజేత

నరసరావుపేట రూరల్, డిసెంబరు 20: సైనికుల సంక్షేమ నిధికి నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సేకరించిన విరాళం శుక్రవారం అందజేశారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం, జిల్లా సైనిక సంక్షేమం అధికారి సూచనల మేరకు, కళాశాల యాజమాన్యం సహకారంతో స్వచ్ఛంద ఈ విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. విరాళంగా వచ్చిన రూ.32000 కలెక్టర్ పి.అరుణ్ బాబు సమక్షంలో, సైనిక సంక్షేమం అధికారికి అందజేశారు. ప్రతి సంవత్సరం డిసెంబరు 7వ తేదీ జరుపుకునే ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్‌డే సందర్భంగా దేశ ప్రజలందరి దగ్గర స్వచ్ఛందంగా చందాలు వసూలు చేసి, యుద్ధంలో చనిపోయిన సైనికుల కుటుంబాలకు, అంగవైకల్యం ఏర్పడిన సైనికుల సంక్షేమం కోసం, సైనికుల కుటుంబాల సంక్షేమం కోసం వినియోగించటం జరుగుతుందని కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, సెక్రటరీ మిట్టపల్లి రమేష్‌బాబు తెలిపారు. విరాళాల సేకరణలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను, కళాశాల ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్ బాబును ప్రత్యేకంగా అభినందించారు.

పల్నాడు జిల్లా టీడీపీ కార్యాలయం నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలం గురించి అధికారులను అడిగితెలుసుకుంటున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయం నిర్మాణానికి నరసరావుపేట పట్టణంలో శుక్రవారం ప్రభుత్వానికి చెందిన స్థలంను అధికారులతో కలిసి టీడీపీ నాయకులు పరిశీలించారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, భాష్యం ప్రవీణ్, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితర నాయకులు ఈ స్థలాన్ని పరిశీలించారు. ఆర్డీవో మధులత, తహసీల్దార్ కే వేణుగోపాల్‌ను అడిగి స్థలం వివరాలను టీడీపీ నాయకులు సేకరించారు. రావిపాడు-ఇస్సపాలెం మార్గం మధ్యలో సరస్వతి శిశుమందిర్ సమీపంలోని కొత్తగా నిర్మించిన రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో ఉన్న 47సెంట్ల భూమి పార్టీ కార్యాలయ నిర్మాణానికి అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి తుది నిర్ణయం తీసుకుంటామని నేతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, కపిలవాయి విజయకుమార్, టీడీపీ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ మాబు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ చెర నుంచి భూమిని విడిపించండి

- ఎమ్మెల్యే పుల్లారావుకు ఎస్టీల వినతి

నాదెండ్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత ఆక్రమణలో ఉన్న తమ భూములను తమకు ఇప్పించటంతో పాటు రక్షణ కల్పించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన యానాది కులస్థులు విజ్ఞప్తి చేశారు. చిలకలూరిపేటలోని ప్రత్తిపాటి నివాసంలో సుమారు 20 కుటుంబాలకు చెందిన వారు ఆయనను కలిశారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన భూమిని వైసీపీ నేత సింగారెడ్డి కోటిరెడ్డి ఆక్రమించుకొని రైతులకు కౌలుకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఆక్రమణ చేసిన భూమి 13.40 ఎకరాలు ఉండగా తమది సుమారు తొమ్మిది ఎకరాలు ఉన్నదని వివరించారు. కొద్ది రోజులుగా పాత తేదీలతో ఉన్న స్టాంపులపై సంతకాలు పెట్టాలని కోటిరెడ్డి అనుచరులు తమను బెదిరిస్తున్నారని వివరించారు. ఈ విషయంపై స్పందించిన పుల్లారావు ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎవ్వరూ భయపడవద్దని, న్యాయం జరిగే విధంగా చూస్తానని వారికి పుల్లారావు భరోసా ఇచ్చారు.

సూఫీ ధ్యాస ఆశ్రమంలో ప్రత్యేక దువా



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

యడ్లపాడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగంగోపాలపురంలోని సూఫీ గురువు హజరత్ సైలాని, నక్ష్‌బన్దీయ బాబా రహమతుల్లా అలైహి గురుపీఠం (సూఫీ ధ్యాస ఆశ్రమం) ఆధ్వర్యంలో ప్రత్యేక దువా కార్యక్రమాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సూఫీ గురువు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ వారు పేదలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదానం చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.3 లక్షల విరాళం



సీఎం చంద్రబాబు నాయుడుకు చెక్కును అందజేస్తున్న లగడపాటి సుబ్బారావు

నూజెండ్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.3 లక్షల చెక్కును సీఎం నారా చంద్రబాబు నాయుడుకు అందజేసినట్టు ఆస్ట్రేలియా మెల్‌బోర్న్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు లగడపాటి సుబ్బారావు శుక్రవారం తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు విజయవంతంగా సాగాలని తమ వంతు బాధ్యతగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు నిధులు సమకూరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రామ్ ముప్పనేని, ప్రకాష్, మారుతి తదితరులు ఉన్నారు.



ఆధార్ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో స్వరూపరాణి

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీడీవో స్వరూపరాణి

నాదెండ్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆధార్ సేవలను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.స్వరూపరాణి కోరారు. మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ కార్డులో ఏమైనా మార్పులు ఉంటే సవరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా ఆమె తనిఖీ చేశారు. భోజనం తయారు చేసే ప్రాంతంలో పరిశుభ్రత పాటించాలని సూచించారు.